క్లుప్తంగా

బాధితుడిని పరామర్శించిన చిన్నారెడ్డి



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబళాపురం గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి కాలుకు గాయమై అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి ఆదివారం బాధితుడిని పరామర్శించారు. ఆయనకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి, మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వృద్ధులకు ఉపకరణాలు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతాపూర్ గ్రామంలోని వృద్ధులకు, దివ్యాంగులకు తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ స్టిక్స్, స్టాండ్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తాను చేస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా 60 మంది దివ్యాంగులకు, వృద్ధులకు వాకింగ్ స్టిక్స్, స్టాండ్స్ అందజేసినట్లు తెలిపారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి సహాయం చేయడం సంతోషంగా ఉందని, తాను చేస్తున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మహేష్ చేస్తున్న సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన భజరంగ్‌దళ్ నాయకులు



కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో భజరంగ్‌దళ్ నాయకులు మొక్కలు నాటారు. సేవ సురక్షిత కార్యక్రమంలో భాగంగా ఆదివారం వారు ఆలయంలో మొక్కలునాటి, వాటి పరిరక్షణ బాధ్యతను స్వీకరించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ సుంకరి పురేందర్, గో సంరక్షణ సంయోజక్ సురేష్‌లు మాట్లాడారు. పంచభూతాల్లో భాగమైన గాలి స్వచ్ఛంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని కోరారు. ప్రకృతి సురక్షితంగా ఉంటేనే మానవజాతి మనుగడ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ పట్టణ సంయోజక్ పులి భరత్, నాయకులు మహేష్, రవి, వెంకటయ్య, నిరంజన్ రెడ్డి, గణేష్, చిదానందం, తదితరులున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

అయిజ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రామకృష్ణ మఠం స్వామీజీ తత్వదానంద మహరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని సంకాపురం గ్రామంలో రామకృష్ణ ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహారాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసు నుంచే ఆధ్యాత్మిక భావన వైపు నడిపించాలని సూచించారు. రాష్ట్ర భావ ప్రచార పరిషత్ మాజీ కన్వీనర్ సూర్యప్రకాశ్, రామకృష్ణ సేవా సమితి సభ్యులు వెంకటరాములు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కంచికామకోటి పీఠం పాలమూరు శాఖ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు ఆదివారం స్వామివారికి ప్రాతఃకాల సమయంలో సుప్రభాతసేవ, మండపదేవతా పూజలు, మూలమంత్ర అనుష్ఠానములు, హనుమత్ వాహనంపై స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. గోవిందనామంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యాన్ని చాటింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవెంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

కేజీబీవీలో కొత్త మెనూ

- బాలికలకు పౌష్టికాహారం
- విద్యార్థినుల్లో రక్తహీనత సమస్యకు పరిష్కారం



పాన్‌గల్‌లో కస్తూర్బా విద్యాలయం



కస్తూర్బాలో భోజనాలు చేస్తున్న బాలికలు(ఫైల్)

పాన్‌గల్: నిరుపేద బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కేజీబీవీల్లో కొత్త మెనూను అమల్లోకి తెచ్చింది. గురుకులాల్లో అమలయ్యే ఆహార మెనూ కేజీబీవీల్లో లేకపోవడంతో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. పాఠశాలల ప్రారంభం నుంచే నూతన మెనూ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. స్థానిక కేజీబీవీలో 230 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు.

నెలకు రూ.1,740

ప్రస్తుత విద్యా సంవత్సరంలో కేజీబీవీల్లో చదువుతున్న ఒక్కో విద్యార్థినికి మెనూ కోసం నెలకు రూ.1,740 ఖర్చు చేస్తారు. గతంలో ఈ ఖర్చు రూ.1,225 ఉండేది. మెనూను అమలు చేసేందుకు ఇటీవలే వంట కార్మికులకు సైతం శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం పదోతరగతి వరకు కొనసాగుతున్న విద్యాలయాల్లోనే ఇంటర్ వరకు ఉన్నతీకరించడంతో బాలకల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పాన్‌గల్‌లో ఇంటర్‌లో కంప్యూటర్ సైన్స్ కోర్సుకు, చిన్నంబావిలో బైపీసీకి ఈ విద్యా సంవత్సరం నుంచి అవకాశం కల్పించారు.

మండలాల వారీగా విద్యార్థినులు..

పాన్‌గల్	చిన్నంబావి	వీపనగండ్ల
230	232	220

కొత్త మెనూ ఇదే..

ఉదయం: టమాట కిచిడి, రాగిజావ, ఇడ్లీ, సాంబార్, బూస్ట్, ఉప్మా, పూరి, పులిహోర, బోండా, వడ, చపాతి, జీరా రైస్, అరటిపండు

మధ్యాహ్నం: అన్నంతో పాటు టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్

సాయంత్రం: ఉడకబెట్టిన శెనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లం–పల్లీలు, అల్లంఛాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి

రాత్రి: వివిధ రకాల కూరలతో అన్నం, సాంబారు, మజ్జిగ అందిస్తారు. నెలలో రెండు సార్లు మాంసాహారం, అయిదు సార్లు గుడ్లు, ప్రతి రోజు నెయ్యి తప్పనిసరి.

పౌష్టికాహారం లభిస్తుంది



కస్తూర్బా విద్యాలయాలల్లో గతంలో అందించే మెనూను మార్చి నూతన మెనూ అమలు చేయడంతో విద్యార్థినులకు పౌష్టికాహారం లభిస్తుంది. మెనూ నిర్వాహకులు ఖచ్చితంగా అమలు చేస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– యామిని, 9వ తరగతి, పాన్‌గల్

కచ్చితంగా అమలు చేయాలి



కస్తూర్బా విద్యాలయాలల్లో చదువుతున్న బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే నూతన మెనూతో బలవర్ధక ఆహారం లభించనుంది. గ్రామీణ ప్రాంత పేద బాలికలకు పౌష్టికాహారం అందడంతో రక్తహీనత సమస్యకు పరిష్కారం లభించనుంది. అధికారులు ప్రతినిత్యం పర్యవేక్షణ చేస్తూ నూతన మెనూ ఖచ్చితంగా అమలు అయ్యేలా చూడాలి.

– మమత, 10వ తరగతి, పాన్‌గల్

నిబంధనలు పాటిస్తాం



ప్రభుత్వం కేజీబీవీల్లో నూతనంగా అమలు చేస్తున్న మెనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పక పాటిస్తాం. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో అందించే మెనూను తప్పక పర్యవేక్షిస్తూ నాణ్యతతో కూడిన భోజనం విద్యార్థులకు అందిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యాలయంలో ఇంటర్‌లో కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రారంభించారు. విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

– హేమలత, ఎస్‌ఓ, కేజీబీవీ, పాన్‌గల్

కొనసాగుతున్న రేషన్ బియ్యం సరఫరా



పాన్‌గల్ స్టాక్ పాయింట్ గోదాం ముందు బియ్యం లోడ్‌తో వాహనాలు

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకంలో భాగంగా మండల కేంద్రలోని స్టాక్ పాయింట్ గోదాం నుంచి సన్నబియ్యం గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు తరలించే ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన (జూన్, జూలై, ఆగస్టు) బియ్యం ఒకే సారి పంపిణీ చేస్తుండటంతో వాటి నిల్వలను స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో వాహనంలో వచ్చిన స్టాక్ మరొక వాహనంలో షిఫ్ట్ చేస్తూ రేషన్ దుకాణాలకు తరలిస్తున్నట్లు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి ఆంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ గోదాం నుంచి పాన్‌గల్ మండలంతో పాటు చిన్నంబావి, వీపనగండ్ల మండలాల రేషన్ దుకాణాలకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం పంపిణీ ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇప్పటి వరకు సగానికి పైగా సరఫరా పూర్తి చేశామని, మిగిలిన వాటికి అంతలోపు సరఫరాను పూర్తి చేస్తామన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ గోదాం ముందు వాహనాల్లో హమాలీలు బియ్యం బస్తాలను నింపుతూ కనిపించారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి



కిష్టగిరి ప్రజలతో మాట్లాడుతున్న మండల అధ్యక్షులు కె మాణిక్యం

వనపర్తి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి హామీలు అమలు చేయాలంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కె మాణిక్యం పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని రాజపేట, కిష్టగిరి, రాజపేట తండా, పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి, రంగాపురం గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని, మోసం చేశారని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మాధవరెడ్డి, వనం రాములు, దిలీప్ రెడ్డి, కర్రెస్వామి, కృష్ణారెడ్డి, వడ్డె రమేష్, పెద్దింటి వెంకటేష్, ధర్మానాయక్, చిట్యాల రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- పొంచి ఉన్న ప్రమాదం.. పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాల

మదనాపురం: మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాల భవనం చుట్టూ మొక్కలు, చెట్లు అలుముకున్నాయి. భవనం గోడలు నెర్రెలు బారాయి. కొన్ని రోజులుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంతో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 1956లో నిర్మించిన ఈ పాఠశాల భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో భయం భయంగా విద్యార్థులు గడుపుతున్నారు. ప్రాంగణంలోనే పాత భవనం ఉండటం వల్ల కొత్త పాఠశాల భవనంలో చదువుకునే విద్యా ర్థులు ఆటల సమయంలో మంచినీరు తాగే సమయంలో మధ్యాహ్న భోజన సమయంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం చుట్టూ తిరుగుతుంటారు. ప్రమాదవశత్తు గోడలు కూలిపడినా ప్రమాదమే.

భవనం ముందు వెనక ఆటలు

ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు పాత పాఠశాల భవనం చుట్టూ ఆటలాడుతారు. ప్రాంగణంలో దిష్టిబొమ్మలా ఉన్న ఈ శిథిలావస్థ భవనం వల్ల ఎప్పుడు ఎం జరుగుతుందోనని ఉపాధ్యాయులు సైతం ఆందోళన పడుతున్నారు. దీనిని తొలగించడం వల్ల పాఠశాల ప్రాంగణం విద్యార్థులకు అనుకూలంగా మారుతుంది. స్థలం పెరుగుతుంది. సత్వరమే సంబంధిత అధికారులు స్పందించి పాత పాఠశాల భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు.

బాతుల పెంపకం



పల్లె ఊరకుంటలో పెంచుతున్న బాతులు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ సమీపంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు బాతుల పెంపకాన్ని చేపట్టి ఉపాధి పొందుతున్నారు. రిజర్వాయర్‌తో పాటు కామదేనుపల్లి చెరువు, పల్లె ఊరకుంట, కల్వరాల గ్రామ సమీపంలోని పలు చెరువులు, గోపల్‌దిన్నె కత్వా తదితర ప్రాంతాలలో బాతుల పెంపకాన్ని ప్రతిఏటా చేపడతారు. ఇతర ప్రాంతాల నుంచి రావడానికి వేసవిలోను రిజర్వాయర్ సమీపంలో నీరు ఉంటుందని, అది బాతుల పెంపకానికి ఉపయోకరంగా ఉంటుందని పెంపకందారులు అంటున్నారు.

విద్యుత్ తీగలపై మొక్కలు తొలగించాలి



గోపాల్‌పేట కోదండరామస్వామి ఆలయ సమీపంలో కరెంటు పోల్‌కు అల్లుకుపోయిన చెట్లు

గోపాల్‌పేట: కరెంట్ స్తంభాలు, తీగలపై అల్లుకుపోయిన పిచ్చి మొక్కలు, ఆకులను తొలగించాలని ఉమ్మడి మండల ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో ఉన్న కరెంటు స్తంభాలకు పిచ్చిచెట్లు అల్లుకుపోతున్నాయి. దీంతో కరెంటు సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతోంది. గోపాల్‌పేట మండల కేంద్రంలో కోదండరామస్వామి ఆలయం సమీపంలో ఉన్న కరెంటు స్తంభానికి తీగరకం చెట్టు కరెంటు పోల్ వైర్లను అల్లుకుపోయింది. ఏదుల మండలంలోని చెన్నారం బస్టాండు సమీపంలో ఓ కరెంటు పోల్‌కు తీగచెట్టు కరెంటు పోల్‌ను అల్లుకుపోయింది. ఉమ్మడి మండలంలో చాలా స్తంభాలకు ఇలాగే పిచ్చిమొక్కలు అల్లుకుపోయి కనిపిస్తున్నాయి. వాటివల్ల కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి తీగచెట్లు తొలగించి కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ



ఖిల్లాఘనపురం: మండలంలోని రుక్కన్నపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాల్మీకి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం విద్యార్థులతకు నోట్‌బుక్‌లతో పాటుగా పలకలు తదితర వాటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, లలితా పబ్లిక్‌స్కూల్ డైరెక్టర్ రుక్మేందర్, గ్రామ మాజీ సర్పంచు, మాజీ ఉప సర్పంచు, సంఘం సభ్యులు, మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.

పాన్‌గల్ ఏడీఏగా డాకేశ్వర్‌గౌడ్

పాన్‌గల్: వ్యవసాయ శాఖ పాన్‌గల్ డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏగా వీపనగండ్ల ఏఓ డాకేశ్వర్‌గౌడ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఏడీఏగా పనిచేస్తున్న చంద్రశేఖర్ హైదరాబాదు జీహెచ్‌ఎంసీకి బదిలీపై వెళ్ళగా, ఆయన స్థానంలో డాకేశ్వర్‌గౌడు ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



పాన్‌గల్: మీకు అండగా మేముంటాం, ప్రజలకు ధైర్యాన్ని ఇవ్వడానికి కవాతు నిర్వహిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలతో ఆదివారం మండల కేంద్రంలో, మాందాపూర్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. మండలంలో ఎటువంటి అల్లర్లు సృష్టించిన, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో మత ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు వస్తే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపు చేయడంలో స్థానిక పోలీసులకు ర్యాపిడ్ బలగాలు సహకరిస్తాయన్నారు. ఆయా గ్రామాల్లో ప్రధాన వీధులు గుండా కవాతు నిర్వహించారు. కవాతులో ఎస్ఐ శ్రీనివాసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారులు జాదేరాహుల్, జటా శంకర్‌యాదవ్, రాముడు, ఫోర్స్ బలగాలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు ప్రహరీ నిర్మించరూ!



వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలలో రైతులు పండించిన పంటలను విక్రయించుకునేందుకు అనువైన వసతులు లేవు. రైతులు తెచ్చిన ధాన్యం ఆరబెట్టుందుకు అనువైన స్థలం లేక ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు కల్వరాల, గోవర్ధనగిరి, తూముకుంట, సంగినేనిపల్లి, వల్లాభాపురం గ్రామాలకు భీమా, జూరాల, కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు అందడంతో రైతులు వరిధాన్యం పండించి బయట ప్రదేశాలలో నిల్వ ఉంచుతారు. ఏ గ్రామంలో కూడా రైతులకు అనువైన మార్కెట్ వసతులు కాని, కంపౌండ్‌వాల్స్ కాని లేకపోవడంతో రాత్రింబవళ్లు ధాన్యం వద్ద కాపల కాయాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి అన్ని గ్రామాలలో ధాన్యం నిల్వ కోసం స్థలాలను గుర్తించి వాటికి కంపౌండ్‌వాల్స్ నిర్మించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కారం



బీజేపీ మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

చిన్నంబావి: వాల్మీకుల సమస్యల పరిష్కారం కోసం వాల్మీకుల ఐక్యతను చాటాలని వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ, రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వాల్మీకి విగ్రహం దగ్గర బీజేపీ మండల అధ్యక్షుడిగా బొగ్గు కురుమయ్య నాయుడు ఎన్నిక కావడంతో ఆయనకు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధించాలి

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని ఎల్లెని సుధాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ధారసింగ్, శ్రీనివాస్ యాదవ్, గోపి నాయుడు, తగరం నరసింహ, మియాపూర్ విజయ్‌కుమార్, హరికాంత్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే!



పెద్దగూడెం గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న తీగలు

- గ్రామాల్లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



కడుకుంట్ల పాఠశాల పక్కన ట్రాన్స్‌ఫార్మర్

వనపర్తి రూరల్: గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, ఇళ్ల పక్కన్న, రోడ్ల వెంట, పాఠశాల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. వాటికి కంచెలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా ప్రయోజనం లేకుండా పోతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రక్షణ కంచెలు లేక ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకంగా ఉన్నాయి. మండలంలో సింగిల్‌ఫేస్ 350, త్రీఫేస్ 1400 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇవన్ని ఇళ్ల మధ్యలో, పాఠశాల, రోడ్డు పక్కన్న ఉండడంతో పశువులు, చిన్న పిల్లలు, ప్రజలు తిరుగుతుంటారు. కనుక ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర విద్యుత్ తీగలు వేలాడుతుండంతో చిన్నపిల్లలకు, పశువులకు తగిలి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని భయపడుతున్నారు. మండలంలోని చిమనగుంటపల్లి, వెంకటాపురం, పెద్దగూడెం, కడుకుంట్ల, చిట్యాల గ్రామాల్లో, మిగతా గ్రామాల్లో అత్యధికంగా జన సంచారం ఉన్న ప్రాంతంలో ఉన్నాయి. వాటికి కంచె లేకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అధికారులు కంచెలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

మండలంలో కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తిస్తాం. వాటిలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న వాటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఏఈ, వనపర్తి

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు..

పెద్దగూడెం ప్రధాన రోడ్డు పక్కన, కడుకుంట్ల పాఠశాల పక్కన్న ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేక ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు వెంబడి ట్రాన్స్‌ఫార్మర్లు ఉండంతో 'పశువులు, మూగజీవాలు పరిసరాల్లో వెళ్తన్నాయి. రక్షణ చర్యలు తీసుకోవాలి.

– కొండన్నగౌడ్, కడుకుంట్ల

కంచె ఏర్పాటు చేయాలి..

పాఠశాల వెనుక భాగం ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. పిల్లలు తిరుతూ ఉంటారు. చిన్నారులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ప్రమాదం సంభవించక ముందే ట్రాన్స్‌ఫార్మకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలి.

– కుమార్, చిట్యాల